క్లుప్తంగా

అంగన్‌వాడీల నిరసన

కడప కోటిరెడ్డిసర్కిల్ : అంగన్వాడీ కార్యకర్తలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఏఐటీయూసీ కడప జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.నాగసుబ్బారెడ్డి డిమాండ్ చేశారు. అంగన్వాడీలు చేపట్టిన సమ్మె గురువారం మూడవ రోజుకు చేరుకుంది. ఇందులో భాగంగా అంగన్వాడీ కార్యకర్తలు రూరల్ కార్యాలయం వద్ద మోకాళ్లపై నిలబడి నిరసన తెలియజేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ కడప నగర ప్రధాన కార్యదర్శి మద్దిలేటి, ఇతర నాయకులు పాల్గొన్నారు.

క్షేత్రపర్యటన

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయం వృక్షశాస్త్ర విభాగం విద్యార్థులు క్షేత్రపర్యటనలో భాగంగా గురువారం కడప నగరంలోని పాల కొండలను సందర్శించారు. వృక్షశాస్త్ర ఆచార్యులు డా. ఎ. మధుసూధన్‌రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులు మొక్కల శాస్త్రీయనామాలు, స్థానిక నామాలు, అవి ఏజాతికి చెందినవి అన్న వివరాలను ప్రత్యక్షంగా చూసి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అరుదైన మొక్కలు, అంతరించిపోయే జాతుల గురించి వివరించారు. తూర్పు కనుమల్లో పెరుగుతున్న మొక్కలను పరిచయం చేశారు.

మహాసభలకు తరలి వెళ్లిన పీడీఎస్‌యూ నాయకులు

కడప ఎడ్యుకేషన్ : నెల్లూరు నగరంలో డిసెంబర్ 15,16,17 తేదీలలో జరిగే పీడీఎస్‌యూ రాష్ట్ర 23వ మహాసభలకు ఉమ్మడి కడప, అన్నమయ్య, శ్రీసత్యసాయి జిల్లాలకు సంబంధించి ప్రతినిధులు తరలి వెళ్లినట్లు పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి అంకన్న, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నాగేశ్వర్, శ్రీనాథ్‌యాదవ్‌లు తెలిపారు. గురువారం వారు మాట్లాడుతూ 15వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు విద్యార్థి ప్రదర్శన, 2.30 గంటలకు బహిరంగ సభ ఉంటుందన్నారు. అనంతరం రెండు రోజుల పాటు జరిగే ప్రతినిధుల సభలో అనేక అంశాలపై చర్చిస్తారన్నారు.

ఓడీగా పరిగణించండి

కడప కల్చరల్ : ఈ నెల 23, 24 తేదీల్లో కడప జెడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించనున్న జిల్లా రచయితల సంఘం సభల్లో తెలుగు ఉపాధ్యాయులు పాల్గొనేందుకు అవకాశం ఇవ్వాలని నిర్వాహకులు కోరారు. గురువారం ఈ మేరకు నిర్వాహకులు వైవీయూ పాలక మండలి సభ్యులు ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి, అధికారభాషా సంఘం సభ్యులు డాక్టర్ తవ్వా వెంకటయ్యలు జిల్లా విద్యాశాఖాధికారి రాఘవరెడ్డిని కలిసి విన్నవించారు. ఈ సభల్లో పాల్గొనేందుకు వీలుగా జిల్లాలోని తెలుగు ఉపాధ్యాయులను అనుమతించాలని, ఆరోజులను ఓడీగా పరిగణించాలని విజ్ఞప్తి చేశారు. డీఈఓ సానుకూలంగా స్పందించి అవసరమైన ఆదేశాలు ఇస్తామని తెలిపారు.

ఆరోగ్యశ్రీ పేదలకు వరం

– వైఎస్‌ఆర్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్ ఖాన్



కడప కార్పొరేషన్ : ఆరోగ్యశ్రీ పథకాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అపర సంజీవనిలా మార్చారని వైఎస్‌ఆర్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్ ఖాన్ అన్నారు. గురువారం తన కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. టీడీపీ హయాంలో ఆరోగ్యశ్రీ పథకాన్ని నిర్వీర్యం చేశారన్నారు. ప్రైవేట్ హాస్పిటల్స్‌కు చెల్లించాల్సిన బకాయిలు కూడా చెల్లించలేదన్నారు. వైఎస్ జగన్ ముఖ్యమంత్రి అయిన తర్వాత రాష్ట్రవ్యాప్తంగా 108, 104 కొత్త వాహనాలను కొనుగోలు చేశారన్నారు. తాజాగా ఆరోగ్యశ్రీ కింద ఉచితంగా వైద్యం చేసే ఖర్చును రూ.5 లక్షల నుంచి రూ. 25 లక్షలకు పెంచడం హర్షనీయమన్నారు. పేదలకు ఇది ఎంతో మేలన్నారు.

ఎస్‌ఐపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : ప్రొద్దుటూరు ఎస్‌ఐ హైమావతి పై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఏపీ బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్స్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మద్దిలేటి పేర్కొన్నారు. గురువారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రొద్దుటూరు వన్ టౌన్ ఎస్‌ఐ హైమావతి పట్టణ సమీపంలోని పెన్నా నదిలో ఇసుక అక్రమ తవ్వకాలు జరుగుతున్నట్లు వచ్చిన సమాచారంతో అక్కడికి వెళ్లిందన్నారు. అయితే అక్కడ ఎస్‌ఐపై ఇసుకాసురులు దాడులు చేయడం హేయనీయమైన చర్య అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్స్ వర్కర్స్ యూనియన్ నగర నాయకులు రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో చదువుకోవాలి



విద్యార్థికి బెడ్‌షీట్‌ను అందజేస్తున్న అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ జ్యోతి

కడప కోటిరెడ్డిసర్కిల్ : జిల్లా బీసీ సంక్షేమ శాఖ పరిధిలోని బీసీ హాస్టల్లో విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పిస్తున్నట్లు అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ జ్యోతి తెలిపారు. గురువారం కడప నగరం ప్రకాష్ నగర్ బీసీ బాలుర వసతి గృహంలో విద్యార్థులకు దుప్పట్లను పంపిణీ చేశారు. అనంతరం జ్యోతి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం హాస్టల్ విద్యార్థుల సంక్షేమానికి అనేక చర్యలు చేపడుతోందన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలన్నారు. కార్యక్రమంలో హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ ప్రసాద్ పాల్గొన్నారు

కల్యాణం.. కమనీయం



కల్యాణోత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు



స్వామి, అమ్మవార్ల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

కడప కల్చరల్ : కడప నగరం మహవీర్ సర్కిల్‌లో నాగులకట్ట వద్దగల శ్రీ సుబ్రమణ్యేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో శ్రీ గోవిందమాల భక్తుల బృందం డిప్యూటీ మేయర్ బండి నిత్యానందరెడ్డి దంపతుల ఆధ్వర్యంలో గురువారం శ్రీనివాస కల్యాణం నిర్వహించారు. కార్యక్రమానికి జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వేద పండితులు విజయ్‌భట్టర్ ఆధ్వర్యంలో అర్చకులు విశేష పూజల అనంతరం కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి కల్యాణమూర్తులను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోవిందమాల ధారులైన డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి బృందం కల్యాణం అనంతరం పాదయాత్రగా తిరుమలకు బయలుదేరింది. ఈ సందర్భంగా శోభాయాత్ర నిర్వహించారు.

శ్రీనివాసుని కృప కోసం...

జిల్లాపై శ్రీనివాసుని కృప ఉండాలని కోరుతూ 21 సంవత్సరాలుగా స్థానిక భక్తులతో కలిసి అన్నమయ్య కాలిబాటన గోవిందమాల ధరించి పాదయాత్ర నిర్వహిస్తున్నామని కల్యాణోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాభక్తుడు అన్నమయ్య వెళ్లిన కాలిబాటలో వెళ్లి తరించాలన్న కోరికతోపాటు ఆ బాటను అభివృద్ధి చేయడం రాష్ట్ర అభివృద్ధిలో భాగమవుతుందన్నారు. డిప్యూటీ మేయర్ బండి నిత్యానందరెడ్డి మాట్లాడుతూ ఐదేళ్లుగా తాము కూడా అన్నమయ్య కాలిబాటన గోవిందమాల భక్తునిగా పాదయాత్ర చేస్తున్నామన్నారు. రాజంపేటలో జెడ్పీ చైర్మన్‌తోపాటు ఇతర భక్తులతో కలిసి తిరుమలకు వెళతామని వివరించారు.

నవరత్న పథకాలతో ప్రతి ఇంటికీ లబ్ధి



25వ డివిజన్‌లో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కడప కార్పొరేషన్ : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న నవరత్నాల పథకాల వల్ల ప్రతి ఇంటికీ లబ్ధి చేకూరిందని జేసీఎస్ అధ్యక్షుడు తోట క్రిష్ణ, కన్వీనర్ మల్లికార్జున, 25వ డివిజన్ కార్పొరేటర్ కె. సూర్యనారాయణ రావు అన్నారు. గురువారం స్థానిక 25వ డివిజన్‌లో నెహ్రూ పార్కు వద్ద 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించి, ప్రభుత్వ సంక్షేమ పథకాల డిజిటల్ బోర్డును ప్రదర్శించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ కడపలో ప్రస్తుతం రూ.2వేల కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని తెలిపారు. ఒక్క 25వ డివిజన్‌లోనే ప్రభుత్వ పథకాల వల్ల రూ.16కోట్లు ప్రజల ఖాతాలకు చేరాయన్నారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి బుక్‌లెట్లు పంచి సర్వే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బీహెచ్ ఇలియాస్, సమరనాథరెడ్డి, శివకేశవ, నాగేంద్ర, సుబ్బరాయుడు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

38వ డివిజన్‌లో....

కడప నగరం 38వ డివిజన్‌లోని యానాది కాలనీలో 'ఎందుకు ఆంధ్రాకు జగనే కావాలి' కార్యక్రమం నిర్వహించారు. జేసీఎస్ అధ్యక్షుడు హరూన్ బాబు, కన్వీనర్ షఫీ, డివిజన్ ఇన్‌చార్జి ఇమ్రాన్ ఈ కార్యక్రమంలో పాల్గొని, వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ప్రభుత్వ సంక్షేమ పథకాల డిజిటల్ బోర్డును ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మైనార్టీ జిల్లా అధ్యక్షుడు చాన్ బాషా, అన్సర్, యాసిర్ పాల్గొన్నారు. సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో నైపుణ్యం ప్రదర్శించాలి

వైవీయూ వీసీ ఆచార్య చింతా సుధాకర్

వైవీయూ : విశ్వవిద్యాలయ బోధనేతర సిబ్బంది తాము నిర్వహించే విధుల్లో నైపుణ్యం ప్రదర్శించాలని వైవీయూ వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ సూచించారు. వైవీయూలో పనిచేస్తున్న బోధనేతర సిబ్బందికి 'కంప్యూటర్ ప్రొఫిషియన్సీ స్కిల్స్'లో భాగంగా ఎంఎస్ ఆఫీసు గురించి గత నెల 6వ తేదీ నుంచి ఈనెల 14వ తేదీ వరకు శిక్షణ ఇచ్చారు. అనంతరం గురువారం సాయంత్రం నిర్వహించిన శిక్షణ ముగింపు కార్యక్రమానికి వీసీ ముఖ్యఅతిథిగా విచ్చేసి శిక్షణ పూర్తి చేసుకున్న ఉద్యోగులకు సర్టిఫికెట్‌లు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ నేర్చుకున్న విషయాలను సాధన చేస్తుండాలని సూచించారు. ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి మాట్లాడుతూ నైపుణ్యత గుర్తింపును తెచ్చిపెడుతుందని అన్నారు. కోర్సు డైరెక్టర్ డా. కె. శ్రీనివాసరావు, శిక్షకులు డా. హనుమంత నాయక్ పాల్గొన్నారు.



శిక్షణ పూర్తి చేసుకున్న సిబ్బందితో వీసీ, ప్రిన్సిపాల్ తదితరులు

ప్రభుత్వ నిర్ణయం ఆనందదాయకం



ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డిని అభినందిస్తున్న కాంట్రాక్టు లెక్చరర్స్ అసోసియేషన్ నాయకులు

కడప ఎడ్యుకేషన్ : కాంట్రాక్టు ఉద్యోగుల రెగ్యులరైజేషన్ విషయంలో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఆనందదాయకమని గవర్నమెంట్ కాంట్రాక్టు లెక్చరర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి చంద్ర మోహన్‌రెడ్డి అన్నారు. గురువారం వీరు కాంట్రాక్టు లెక్చరర్ల బృందంతో కడపలో ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డిని కలిసి అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంట్రాక్టు ఉద్యోగుల రెగ్యులరైజేషన్‌కు సంబంధించిన గైడ్‌లైన్స్ ప్రభుత్వం 13వ తేదీ విడుదల చేసిందన్నారు. కాంట్రాక్టు లెక్చరర్ల సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి మండలిలో సైతం వాణిని వినిపించి గైడ్‌లైన్స్ వచ్చే వరకు ఎమ్మెల్సీ కృషి చేశారని కొనియాడారు. అనంతరం ఎమ్మెల్సీ మాట్లాడుతూ ఈ నెల 15వ తేదీ నుంచి కాంట్రాక్టు ఉద్యోగుల రెగ్యులరైజేషన్ కోసం రూపొందించిన సాఫ్ట్‌వేర్‌లో నమోదు ప్రక్రియ ప్రారంభమౌతుందన్నారు. సంక్రాంతిలోపు అర్హత కలిగిన ఉద్యోగులందరికీ రెగ్యులరైజేషన్ చేసేలా ప్రభుత్వం చర్యలు చేపడుతుందన్నారు.

తుపాను బాధితులను ఆదుకుంటాం

రాష్ట్ర ఉద్యాన శాఖ సలహాదారు సంబటూరు ప్రసాద్‌రెడ్డి



అరటి పంటను పరిశీలిస్తున్న సంబటూరు ప్రసాద్‌రెడ్డి

ఒంటిమిట్ట/రాజంపేట రూరల్ : మిచాంగ్ తుపాను కారణంగా పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని రాష్ట్ర ఉద్యాన శాఖ కమిటీ సలహాదారు సంబటూరు ప్రసాద్‌రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని నరవకాటిపల్లిలో తుపాను వల్ల దెబ్బతిన్న అరటి పంటను రాష్ట్ర గిడ్డంగుల శాఖ కార్పొరేషన్ డైరెక్టర్ ఆకేపాటి వేణుగోపాల్‌రెడ్డి, ఉద్యాన, వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా దెబ్బతిన్న పంటల రైతులను ఆయన పరామర్శించి, ప్రభుత్వం తప్పకుండా మీకు అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. అనంతరం ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ పంట చేతికి వస్తుందనుకుంటున్న తరుణంలో తుపాను కారణంగా దెబ్బతిని రైతులు నష్టపోవడం బాధాకరమన్నారు. దీనిపై రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో ఉన్న అన్ని జిల్లాల కలెక్టర్లకు ఈనెల 18వ తేదీ లోపు పంట నష్టాన్ని గుర్తించి స్థానిక ఆర్‌బీకే కేంద్రాల వద్ద ప్రదర్శించాలని ఆదేశాలిచ్చారన్నారు. అలానే ఈ నెల 22 లోపు తుది నివేదిక వచ్చాక, జనవరి మొదటి వారంలో నష్టపోయిన రైతులకు పరిహారం ఇస్తామని తెలిపారు. గత ప్రభుత్వాలు తుపాను కారణంగా నష్టపోయిన రైతులను గుర్తించి నష్టపరిహారం అందించడంలో విఫలమయ్యాయన్నారు. నేడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక తీసుకొచ్చిన ఆర్‌బీకే వ్యవస్థ అసిస్టెంట్ల ద్వారా తుపాను వచ్చిన రెండు, మూడు రోజులకే దెబ్బతిన్న పంటలను అంచనా వేసి, ఉన్నతాధికారులకు పంపించడం జరుగుతోందన్నారు.

– రాజంపేట మండలంలో కూడా తుపాను వల్ల దెబ్బతిన్న పంటలను ఆయన పరిశీలించారు.

పౌష్టికాహారం తీసుకోవాలి

వైవీయూ : విద్యార్థినులు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా రక్తహీనత సమస్యను అధిగమించవచ్చని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా. సలీంబాషా పేర్కొన్నారు. గురువారం కళాశాలలో ఉమన్ ఎంపవర్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో ×అనీమియా–ఆరోగ్య సమస్యలు₹ అన్న అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వైద్యాధికారి డా. షంషాద్‌బేగం విచ్చేసి రక్తహీనత సమస్యలను, నివారణోపాయాలను వివరించారు. కార్యక్రమంలో కళాశాల మహిళా సాధికారత సమన్వయకర్త వై. నాగరత్నమ్మ, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న భవన నిర్మాణ కార్మిక సంఘం ప్రతినిధులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : భవన నిర్మాణ పనులు చేస్తూ ప్రమాదవశాత్తు మృతి చెందిన కార్మికుని కుటుంబ సభ్యులకు కాంట్రాక్టర్ జయరామిరెడ్డి, భవన నిర్మాణ కార్మిక సంఘ మేస్త్రీలు అండగా నిలబడ్డారు. ఈ మేరకు కడప నగరంలోని వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మృతి చెందిన కార్మికుడు మునికుమార్ కుటుంబ సభ్యులకు రూ. 2,50,000 అందించి ఆదుకున్నారు. ఈ కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షులు రామలింగారెడ్డి, అధ్యక్షులు యల్లారెడ్డి, వెంకటయ్య, జనరల్ సెక్రటరీ రాజేంద్ర, ట్రెజరర్ చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు నాటక ప్రదర్శన

కడప కల్చరల్ : క్రిస్మస్ ముందస్తు వేడుకల్లో భాగంగా శుక్రవారం సాయంత్రం 6.30 గంటలకు స్థానిక సీఎస్‌ఐ చర్చి ఆవరణలో కొరియన్ బృందంచే క్రీస్తు పుట్టుక నాటక ప్రదర్శన ఉంటుందని చర్చి కమిటీ కార్యదర్శి మనోహర్‌బాబు తెలిపారు. ఇందులో కొరియాకు చెందిన 75 మంది కళాకారులు పాల్గొని నటించనున్నట్లు తెలిపారు.

క్రీడాకారిణికి అభినందన



మహబూబ్‌చాంద్‌ను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

వైవీయూ : కడప నగరంలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థిని ఎస్. మహబూబ్‌చాంద్ ఇటీవల నిర్వహించిన సౌత్‌వెస్ట్ అంతర్ విశ్వవిద్యాలయాల వెయిట్‌లిఫ్టింగ్ కాంపిటీషన్‌లో కాంస్యపతకం సాధించింది. ఈమెకు గురువారం కళాశాలలో అభినందన కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ డా. వి. సలీంబాషా మాట్లాడుతూ కళాశాల బీఏ విద్యార్థిని 64 కేజీల విభాగంలో కాంస్యపతకం సాధించడం అభినందనీయమన్నారు. కళాశాల ఫిజికల్ డైరెక్టర్ మదన్‌మోహన్ మాట్లాడారు. అనంతరం ఆమెను సన్మానించి, నగదు బహుమతిని అందజేశారు. వైవీయూ ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డా. ఎన్. వెంకట్రామిరెడ్డి, పీఓలు విజయలక్ష్మి, శచీదేవి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం

పెండ్లిమర్రి : రైతులు పంటల సాగులో ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటిస్తే లాభదాయకంగా ఉంటుందని ప్రకృతి వ్యవసాయం జిల్లా అడిషనల్ ప్రాజెక్టు మేనేజర్ వసంతకుమారి తెలిపారు. గురువారం మండలంలోని పాత సంగటిపల్లె గ్రామ పొలాల్లో సాగులో ఉన్న పంటలను ఆమె పరిశీలించి మాట్లాడారు. పంట సాగు చేస్తే ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయంపై మొగ్గు చూపేలా అవగాహన కల్పించాలన్నారు. ప్రతి మహిళ ఏటీఎం మోడల్, ఏగ్రేడ్ మోడల్, కిచెన్‌గార్డెన్‌లు వేయాలని సూచించారు. కార్యక్రమంలో ఐబీ ఏపీఎం శైలజ, వెంకటేశ్వరావు, ఎంటీ గంగిరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

కరోనా, వరదల సమయంలో

మీరెక్కడున్నారు...?

- కడపలో జరుగుతున్న అభివృద్ధి మీ కళ్లకు కనిపించలేదా...!
- డిప్యూటీ సీఎం అంజద్‌బాషాపై చేసిన ఆరోపణలకు ఆధారాలు చూపండి
- వైఎస్సార్‌సీపీ నాయకుల డిమాండ్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కడప కార్పొరేషన్ : కడప నగర ప్రజలు కరోనా మహమ్మారితో, వరదలు వచ్చిన సందర్భంలో అల్లాడుతున్నప్పుడు టీడీపీ పార్లమెంట్ ఇన్‌చార్జి శ్రీనివాసులరెడ్డి ఎక్కడున్నాడని వైఎస్సార్‌సీపీ నాయకులు ఎస్. సుబ్బారెడ్డి, ఎస్‌ఎండీ షఫీ, ఎస్‌ఎండీ రఫీ, త్యాగరాజు, పి. జయచంద్రారెడ్డి ప్రశ్నించారు. గురువారం సాయంత్రం స్థానిక డిప్యూటీ సీఎం క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఎన్నికల్లో ఓట్ల కోసం నాటకాలు ఆడుతూ ప్రజలను మభ్యపెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. సభ్యత, సంస్కారం గూర్చి అంజద్‌బాషాకు శ్రీనివాసులరెడ్డి చెప్పాల్సిన పనిలేదన్నారు. కడప నగరంలో రూ. 2150కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. రిమ్స్‌ను సూపర్‌స్పెషాలిటీ హాస్పిటల్‌గా అప్‌గ్రేడ్ చేయడం, కేన్సర్ హాస్పిటల్, మానసిక వైద్యశాల పనులు మొదలుకొని ఇప్పటికే పూర్తయిన మహవీర్ సర్కిల్– రిమ్స్, ఎర్రముక్కపల్లె– రైల్వేస్టేషన్, రాజీవ్ మార్గ్, ప్రస్తుతం జరుగుతున్న అంబేడ్కర్ సర్కిల్– వై జంక్షన్, గోకుల్ సర్కిల్– అన్నమయ్య సర్కిల్, క్రిష్ణా సర్కిల్– దేవునికడప, మాసాపేట సర్కిల్– కేసీకెనాల్ రోడ్లను పరిశీలిస్తే ఇది అర్థమవుతుందన్నారు. అలాగే బుగ్గవంక రక్షణ గోడను పూర్తి చేసి, కొత్తగా రెండు బ్రిడ్జిలు మంజూరు చేయించడం జరిగిందన్నారు. బుగ్గవంక రక్షణ గోడ చుట్టూ 40 అడుగుల వెడల్పుతో అప్రోచ్ రోడ్లు నిర్మిస్తున్నామన్నారు. ఎన్‌ఓసీలు ఇచ్చి వక్ఫ్ ఆస్తులను దోచుకున్నారని, మూడు వెంచర్లలో ప్రభుత్వ స్థలాలు ఆక్రమించి, ప్రభుత్వ నిధులతో రోడ్లు వేయించుకున్నారని మాట్లాడటం దారుణమన్నారు. ఏ సర్వే నంబర్లలో ఎంత ఆక్రమించారో శ్రీనివాసులరెడ్డి ఆధారాలు చూపాలన్నారు. ఆ మూడు వెంచర్లకు అంజద్‌బాషాకుగాని, వారి సోదరులకు గానీ ఎలాంటి సంబంధం లేదన్నారు. శ్రీనివాసులరెడ్డి సతీమణి మాధవి రెడ్డికి కడపలో ఓటు హక్కు కూడా లేదన్నారు. శ్రీనివాసులరెడ్డి వ్యాపారాలు, కాంట్రాక్టులతో కుటుంబాన్ని అభివృద్ధి చేసుకున్నారే తప్పా ప్రజలకు ఎలాంటి మేలు చేయలేదని విమర్శించారు. ఐదేళ్లపాటు కడపకు టీడీపీ ఇన్‌చార్జిగా ఉండి ఏం చేయలేకపోయానని కడప ప్రజలను క్షమాపణ కోరాలని, ఆ తర్వాతే ఓట్లు అడగాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు బంగారు నాగయ్య యాదవ్, ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు సీహెచ్ వినోద్ కుమార్, మైనార్టీ జిల్లా అధ్యక్షుడు చాంద్‌బాషా, కార్పొరేటర్ కె. సూర్యనారాయణ రావు, మునిశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆలయాల హుండీ సొమ్ము లెక్కింపు



మృత్యుంజయకుంట శివాలయ హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న అర్చకులు, సిబ్బంది

కడప కల్చరల్ : కడప నగరం మృత్యుంజయకుంట శివాలయంలో హుండీ ఆదాయాన్ని గురువారం లెక్కించారు. దేవాదాయశాఖ కార్యనిర్వహణాధికారి ఎ.శ్రీధర్ ఆధ్వర్యంలో ఇన్‌స్పెక్టర్ జనార్దన్ పర్యవేక్షణలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. గత మాసం 2వ తేదీ నుంచి ఇప్పటి వరకు మృత్యుంజయకుంట శివాలయం హుండీల ద్వారా రూ. 56,245 లభించాయని వారు తెలిపారు. స్థానిక మోచంపేటలోని శ్రీ ప్రసన్న విశ్వేశ్వరస్వామి ఆలయంలో కూడా లెక్కింపు చేపట్టారు. ఇందులో జూన్ 13 నుంచి ఇప్పటి వరకు రూ. 51,635 లభించిందన్నారు. మోచంపేట శివాలయంలో అర్చకులు ఆలూరు రవిశంకర్, మల్లేశ్వరశాస్త్రి, సిబ్బంది శేషారెడ్డిలు పాల్గొనగా, మృత్యుంజయకుంట శివాలయంలో అర్చకులు శశిధర్‌శర్మ, దక్షిణామూర్తి, భక్తులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న అఖిలపక్ష పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు

కడప సెవెన్‌రోడ్స్ : జిల్లాలో కరువు, తుపాను వల్ల నష్టపోయిన రైతులను తక్షణమే ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ అఖిలపక్ష పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు గురువారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర, జనసేన జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు, సీపీఎం నగర కార్యదర్శి రామ్మోహన్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకుడు సత్తార్ మాట్లాడుతూ కరువు, తుపాను సహాయక చర్యలు చేపట్టకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు. జిల్లాలో ఇంతవరకు ఒక్క మండలాన్ని కూడా కరువు జాబితాలో చేర్చకపోవడం విచారకరమన్నారు. నష్టపోయిన రైతుల వివరాలు సేకరించి నష్టపరిహారం, బీమా చెల్లించాలని కోరారు. ప్రత్యామ్నాయ పంటలకు విత్తనాలు, ఎరువులు ఉచితంగా ఇవ్వాలన్నారు. డ్రిప్‌పై రాయితీ పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు రామయ్య, నాగసుబ్బారెడ్డి, ఎంవీ సుబ్బారెడ్డి, కేసీ బాదుల్లా,వెంకట శివ, సీపీఎం నాయకుడు దస్తగిరి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తపాలా ఉద్యోగుల అర్ధనగ్న ప్రదర్శన



పోస్టల్ ప్రధాన కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న గ్రామీణ డాక్ సేవకులు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : గ్రామీణ డాక్ సేవకుల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం కృషి చేయాలని ఆలిండియా గ్రామీణ డాక్ సేవక్స్ యూనియన్ (ఏఐజీడీఎస్‌యు) జిల్లా కార్యదర్శి రాము పేర్కొన్నారు. గురువారం గ్రామీణ డాక్ సేవక్‌ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నగరంలోని పోస్టల్ ప్రధాన కార్యాలయం ఎదుట మూడవ రోజు అర్ధనగ్న ప్రదర్శన సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ గ్రామీణ డాక్ సేవకుల సంక్షేమానికి కమలేష్ చంద్ర కమిటీ సిఫార్సులను అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలిండియా గ్రామీణ డాక్ సేవక్స్ యూనియన్ అధ్యక్షుడు కృష్ణయ్య, యూనియన్ నాయకులు మహేష్ చంద్ర, రఘురామిరెడ్డి, రఫీ తదితరులు పాల్గొన్నారు.

ఇంధన పొదుపు ప్రతి ఒక్కరి బాధ్యత



ర్యాలీ చేస్తున్న విద్యుత్ ఉద్యోగులు, సిబ్బంది

కడప కార్పొరేషన్ : భవిష్యత్తు తరాల కోసం ఇంధన భద్రత, ఇంధన పొదుపు ప్రతి ఒక్కరి బాధ్యత అని ఏపీ ఎస్‌పీడీసీఎల్ కడప సర్కిల్ పర్యవేక్షక ఇంజినీరు ఎస్. రమణ అన్నారు. ఇంధన పొదుపు వారోత్సవాలలో భాగంగా గురువారం విద్యుత్ ఉద్యోగులు, సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. విద్యుత్ భవన్ నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ మహవీర్ సర్కిల్ మీదుగా సంధ్యా సర్కిల్ వరకూ సాగింది. ఈ సందర్భంగా ఎస్‌ఈ మాట్లాడుతూ ఈ నెల 14 నుండి 20వ తేదీ వరకు జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంధన సామర్థ్యం, పరిరక్షణ ప్రాముఖ్యత, విద్యుత్ ఆదా గురించి ప్రజలలో అవగాహన కల్పించటమే ఈ వారోత్సవాల ముఖ్య ఉద్దేశ్యమన్నారు. ఏసీలు, రిఫ్రిజిరేటర్లు , వాషింగ్ మిషన్‌లు వాడే విధానంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ టెక్నికల్ హరి సేవ్య నాయక్, విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ భాస్కర రెడ్డి, విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

బైబిల్ మిషన్ ప్రార్థనశాల ప్రారంభం



ఆరాధన ఉత్సవంలో పాల్గొన్న భక్తులు

దువ్వూరు : మండలంలోని గుడిపాడు గ్రామం వద్ద బైబిల్ మిషన్ ప్రార్థనశాల ప్రతిష్ఠ ఆరాధన ఉత్సవం ఘనంగా నిర్వహించారు. బైబిల్ మిషన్ ప్రారంభోత్సవానికి మైదుకూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త శెట్టిపల్లె నాగిరెడ్డి హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ఇటువంటి అద్భుతమైన బైబిల్ మిషన్ చర్చిని నెలకొల్పడం నియోజకవర్గానికి గర్వకారణమన్నారు. ప్రారంభోత్సవానికి తనను ఆహ్వానించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. దైవకార్యానికి వేలాది మంది భక్తులు హాజరవ్వడం హర్షణీయమన్నారు. ఏసుక్రీస్తు దీవెనలు మీ అందరిపై ఉండాలని ప్రార్థించారు. అక్కడికి వచ్చిన వారందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. బైబిల్ మిషన్ నిర్వాహకుడు అద్భుత కుమార్ మాట్లాడుతూ ఈ ప్రార్థన శాలకు కరెంటు, రోడ్లు, నీటి సౌకర్యాల కోసం సహకరించిన ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రారంభ కార్యక్రమంలో నందికొట్కూరు ఎమ్మెల్యే ఆర్థర్‌తోపాటు విదేశీయులు, రాయలసీమ జిల్లాలతో పాటు తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల నుంచి భక్తులు పాల్గొన్నారు. దువ్వూరు ఎంపీపీ కానాల జయచంద్రారెడ్డి, గుడిపాడు ఎంపీటీసీ గోపిరెడ్డి శ్రీనివాసుల రెడ్డి, సర్పంచ్ మాబు షరీఫ్‌లు హాజరయ్యారు.